గాయకుడు విజయ్ ప్రకాశ్‌కు టొరంటోలో డాక్టరేట్

బెంగళూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నేపథ్య గాయకుడు విజయప్రకాశ్ టొరంటోలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆయన కళారంగానికి అందించిన సేవలను గుర్తించి ఆదివారం ప్రదానం చేశారు. కెనడా రాజధాని టొరంటోలోని రిచ్‌మండ్ గ్యాబ్రియేల్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ఇచ్చింది. విజయ ప్రకాశ్ కన్నడ, తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పాటలు పాడతారు. దేశ విదేశాల్లోనూ ఎన్నో వేదికలపై తన పాటల సందడి కొనసాగించారు. గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వేళ లైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలుభాషల నటులు, దర్శక నిర్మాతలు అభినందించారు.

● ప్రధాని చెప్పినవన్నీ అబద్ధాలే..

రాష్ట్రానికి కేంద్రం తీరని అన్యాయం


శిడ్లఘట్ట రోడ్ షోలో సీఎం సిద్దరామయ్య

● ఖాళీ చెంబు ఇచ్చి అక్షయపాత్ర అనడం హాస్యాస్పదం ● కుటుంబం కోసమే దేవెగౌడ ఆరాటం ● రోడ్ షోలో సీఎం సిద్ధరామయ్య

బంగారపేట, ఏప్రిల్ 21: కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో రాష్ట్రానికి తగినంత గ్రాంట్లు ఇవ్వకుండా అన్యాయం చేశారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కోలారు జిల్లా బంగారపేట పట్టణంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ చిక్కబళ్ళాపులో ప్రధాని మోదీ, మాజీ ప్రధాని దేవెగౌడలు మాట్లాడిన వన్నీ అబద్ధాలే నన్నారు. మోదీ ఇచ్చిన ఖాళీ చెంబును దేవెగౌడ అక్షయపాత్రగా పేర్కొన్నారన్నారు. ఖాళీ చెంబు మీకు అక్షయపాత్రగా కనిపిస్తే రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఏమైనట్లు అని ప్రశ్నించారు. కరువు నిధులు ఎందుకు రాలేదని, వరదల వేళ రాష్ట్రాన్ని ఎందుకు ఆదుకోలేదని ప్రశ్నించారు. రాష్ట్ర రైతుల పంటల రుణాలు ఎందుకు మాఫీ చేయలేదన్నారు. రైతులు పండించే పంటలకు కనీస ధర ఎందుకు ఇవ్వలేదన్నారు. ప్రధాని మోదీ కేవలం పారిశ్రామిక వేత్తలకు లక్షల కోట్ల రూపాయలు రుణాన్ని మాఫీ చేసి అన్నదాతలను విస్మరించారన్నారు. 15వ ఆర్థిక సంఘంలో జరిగిన నష్టాన్ని భరించాలన్నారు. కోలారు లోక్‌సభ నియోజకవర్గంలో గౌతమ్ గెలుపు ఖాయమన్న విశ్వాసం వ్యక్తం చేశారు. బంగారపేట శాసనసభ నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ సాధించడం ద్వారా ఎమ్మెల్యే నారాయణస్వామికి మరింత బలం ఇవ్వాలని కోరారు. అతివృష్టి - అనావృష్టి పరిహారంలోనూ, ప్రత్యేక గ్రాంట్లలోనూ, జీఎస్టీ వాటాలోనూ అన్యాయం జరిగిందన్నారు. విదేశాలనుంచి నల్లధనం రప్పించి అందరి ఖాతాల్లోకి తలా రూ.15లక్షలు వేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ.2వేలు ఇస్తోందని, కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రతి అర్హులైన మహిళ ఖాతాకు ఏడాదికి లక్ష రూపాయలు జమ చేస్తామని హామీ ఇచ్చారు. విద్యావంతులైన నిరుద్యోగులకు రూ. లక్ష వేతనం లభించేలా చేస్తామన్నారు. దారి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిన పెడతామన్నారు. మంత్రి బైరతి సురేశ్, ఎమ్మెల్యేలు కొత్తూరు మంజునాథ, ఎస్ఎన్ నారాయణస్వామి, నజీర్ అహ్మద్, అనిల్‌కుమార్, అభ్యర్థి కేవీ గౌతమ్ పాల్గొన్నారు.


బంగారపేట రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట: ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదివారం శిడ్లట్టలో రోడ్ షో నిర్వహించారు. బస్టాండ్ నుంచి అమీర్‌బాబా దర్గా వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తమ స్వార్థం కోసం జేడీఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకుందని మాజీ ప్రధాని దేవెగౌడను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దేవెగౌడ తన కుమారుడికి, అల్లుడికి, మనవడికి టిక్కెట్ ఇచ్చారన్నారు. ఇంకా ఎవరైనా కుటుంబంలో కోరితే ఢిల్లీకి వెళ్లి సాధించుకుంటారన్నారు. మేం ఇచ్చిన హామీకి అనుగుణంగా గ్యారెంటీ పథకాలు అమలు చేశామనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. కాగా శిడ్లఘట్టలో హైటెక్ పట్టుగూళ్ల మార్కెట్‌కోసం రూ.60కోట్లు మంజూరు చేశామన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత అన్నారు. అన్నభాగ్య, క్షీర భాగ్య, ఇందిరా క్యాంటీన్ తదితర భాగ్యల పేరిట పథకాలు అమలు చేస్తోందన్నారు. మంత్రి బైరతి సురేశ్‌తో స్థానిక నేతలు రాజీవ్‌గౌడ, పుట్టు ఆంజనప్ప చర్చించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విధానం అమలు చేసేందుకు రూ.70కోట్లు మంజూరు చేయించారన్నారు. అభ్యర్థి గౌతమ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ పాలనలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ర్యాలీలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎంసీ సుధాకర్, మంత్రి కేహెచ్ మునియప్ప, అభ్యర్థి గౌతమ్, కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గౌడ, పుట్టు ఆంజినప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సజనా రాజీవ్ గౌడ తదితరులు పాల్గొన్నారు.


నేహా కుటుంబీకులను పరామర్శిస్తున్న జేపీ నడ్డా, జోషి తదితరులు

నేహా కుటుంబానికి నడ్డా పరామర్శ

బెంగళూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కళాశాల ప్రాంగణంలో హత్యకు గురైన నేహా హిరేమఠ కుటుంబాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పరామర్శించారు. ఆదివారం హుబ్బళ్ళిలోని నిరంజన హిరేమఠ ఇంటికి వెళ్లారు. విద్యార్థిని హత్య తీవ్రంగా బాధ కలిగిందని నడ్డా విచారం వ్యక్తం చేశారు. మీ కుటుంబానికి అండగా ఉంటామని నడ్డా భరోసా ఇచ్చారు. చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. కుమార్తెను కోల్పోయిన బాధ అర్థం అవుతోందని నేహా తల్లితోపాటు ఇతరులను ఆయన ఓదార్చారు. ఆయనతో పాటు కేంద్రమంత్రి, హుబ్బళ్ళి-ధారవాడ అభ్యర్థి ప్రహ్లాద్‌జోషి ఉన్నారు. కాగా నిరంజన హిరేమఠ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ కాగా ఆ పార్టీకి చెందిన రాష్ట్ర నాయకులు ఎవరూ పరామర్శించకపోగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వెళ్లి ఓదార్చడం హుబ్బళ్ళిలో ప్రధానమైన చర్చగా మారింది.

నేహా హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన నేహా హీరేమఠ హత్య కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. నేహా హత్య అనంతరం నిజమైన ప్రేమకు న్యాయం కావాలంటూ పోస్ట్ చేసిన వ్యక్తిని ధారవాడలో భజరంగ్‌దళ్ కార్యకర్తలు గుర్తించారు. అతడిని పోలీసులకు అప్పగించారు. ధారవాడలోని గౌళివీధికి చెందిన సాదిక్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. సాదిక్ సోషల్‌మీడియా ద్వారా ఫయాజ్, నేహాలు ఉండే ఫోటోలను షేర్ చేసి 'జస్టిస్ ఫర్ లవ్' అంటూ పోస్ట్ చేశారు. భజరంగ్‌దళ్ జిల్లా సంచాలకులు సిద్దలింగయ్య హిరేమఠ స్పందించి సాదక్‌ను గుర్తించి విద్యాగిరి పోలీసులకు అప్పగించారు. కాగా ఇవే పోస్టులను షేర్ చేసిన ఆదిల్ అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా నేహా హత్య కేసులో నిందితుల తరఫున వకాలత్ వేయరాదని ముస్లిం అడ్వకేట్‌లకు అంజుమన్ సంస్థ విన్నవించిది. ఈమేరకు అంజుమన్ సంస్థ ముఖ్యులు ఏఎం హిండసగేరి ఆదివారం నేహా కుటుంబ సభ్యులను పరామర్శించారు. హత్యకు సంబంధించి వకాలత్ వేయరాదని నిర్ణయించామని ముస్లిం సామాజికవర్గం నేహా కుటుంబానికి అండగా ఉంటుందని, నిందితుడికి కఠినశిక్ష పడాల్సిందేనన్నారు. అయితే లవ్ జిహాద్ అనే పదం వాడరాదని, రాజకీయాలు చేయరాదని అంజుమన్ సంస్థ తరఫున కోరుతున్నట్లు తెలిపారు.నేహా హత్యను ఖండిస్తూ బీదర్‌లో శనివారం జరిగిన నిరసనలో కార్పొరేటర్ శశిధర్ హొసహళ్ళి, విరూపాక్ష గాదగిలు రెచ్చగొట్టేలా ప్రసంగించారని పోలీసులు అరెస్టు చేశారు.

ఎన్నికల కోడ్ వేళ..

రూ.403 కోట్ల సామగ్రి సీజ్

బెంగళూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ నిబంధనలు ప్రారంభమైన నాటి నుంచి రూ.403.40 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వివరాలను ఎన్నికల కమిషన్ ఆదివారం ప్రకటించింది. వీటిలో నగదు 75.47 కోట్లు కాగా, మద్యం రూ.177.34 కోట్లు, డ్రగ్స్ 11.23 కోట్లుగా గుర్తించారు. బంగారం 57.67 కోట్ల విలువైనది కాగా వెండి 1.18 కోట్లుగాను, వజ్రాలు 9 లక్షల విలువైనవి ఉన్నాయి. ఉచిత పంపిణీలతో ఇతరత్రా వస్తువులను 72.27 కోట్ల విలువైన వాటిగా గుర్తించారు. ఇలా ఎన్నికల కోడ్ ప్రారంభమైనప్పటి నుంచి 1975 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అబ్కారీశాఖలో వివిధ సెక్షన్‌లకింద 23,522 కేసులు నమోదు చేసి 1739 వాహనాలను సీజ్ చేశారు. బయ్యప్పనహళ్ళి పోలీసులు 185 గ్రాముల కొకైన్, 45 గ్రాముల ఎక్స్‌టసీ మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.49.52 లక్షలుగా ప్రకటించారు.


వింటేజ్‌కార్ల ర్యాలీకి పచ్చజెండా ఊపుతున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్

ప్రతి ఒక్కరూ ఓటెయ్యండి: గవర్నర్

బెంగళూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం రాజ్‌భవన్‌లో వింటేజ్ కార్లు, బైక్ ర్యాలీని గవర్నర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఓటు వేయడం అంటే ప్రజాప్రభుత్వాన్ని బలపరచడమే అన్నారు. మన ఓటుతోనే గెలుపోటములు నిర్ధారణ కాకపోవచ్చునని కానీ శక్తివంతమైన ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటుకు మార్గదర్శకం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. చీఫ్ సెక్రటరీ రజనీశ్ గోయెల్, ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ మీనా, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్, నగర పోలీస్ కమిషనర్ దయానంద్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

జక్కూరు లే అవుట్‌లో

నగరంలోని జక్కూరు లే అవుట్‌లో ఓటు జాగృతిపై అవగాహన కల్పించారు. ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ మీనా, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్‌తోపాటు పలువురు ర్యాలీలో భాగస్వామ్యులయ్యారు. 'ఐ యామ్ ప్రౌడ్ ఓటర్' తదితర ప్లకార్డులను ప్రదర్శించారు. రంగు రంగుల బెలూన్లు ఎగురవేయడంతో పాటు కళాబృందాలు జాగృతి కల్పించాయి.


ఓటర్ల జాగృతిలో బెలూన్లు ఎగరవేస్తున్న అధికారులు




- బళ్లారి జిల్లాలో మరోసారి కమలం వికసించేనా..?
- ఈసారైనా శ్రీరాములును ఆదరించేరా..
- గ్యారెంటీలే తుకారాంకు బలం..




గనులనాడులో.. ఘనులెవ్వరో..?

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 21: గనుల నాడుగా పేరొందిన బళ్లారి జిల్లాలో ఒకప్పుడు కమలం ఏకపక్షంగా రాజ్యమేలింది. అయితే గాలి కుటుంబంలో చీలికలు, కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు జత కట్టడంతో అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం హవా కొనసాగింది. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో బళ్లారి రూరల్ నియోజకవర్గం నుంచి బి.నాగేంద్ర చేతిలో ఓడిపోయిన మాజీమంత్రి శ్రీరాములకు ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందడం అగ్నిపరీక్షగానే చెప్పుకోవచ్చు. బళ్లారి-విజయనగర ఉభయ జిల్లా లోక్‌సభ స్థానానికి బి.శ్రీరాములు, సండూరు నియోజకవర్గానికి నాలుగు సార్లు గెలుపొందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన తుకారం మధ్య తీవ్ర పోటీ నెలకొందని చెప్పవచ్చు. 2008లో జరిగిన డీ-లిమిటేషన్ తరువాత బళ్లారి లోక్‌సభ నియోజకవర్గం ఎస్టీకి రిజర్వు చేయబడింది. శ్రీరాములు భవిష్యత్తు రాజకీయం ప్రస్తుతం లోక్‌సభ నియోజకవర్గం విజయం పైనా ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. బళ్లారి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. శాసనసభ ఎన్నికల్లో ఆరు నియోజకవర్గాలను కాంగ్రెస్ దక్కించుకోగా, ప్రస్తుతం మైత్రి కూటమిగా ఏర్పడిన బీజేపీ, జేడీఎస్ తలా ఒక స్థానం దక్కించుకున్నాయి. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 6లక్షలకు పైగా ఎస్టీ ఓటర్లు ఉండగా, లింగాయతులు, అల్పసంఖ్యాకులు, కురుబ సమాజానికి చెందిన ఓటర్ల సంఖ్యలో ఉన్నారు. వీరే లోక్‌సభ అభ్యర్థిని ఎంపిక చేయడంలో కీలక పాత్ర పోషిస్తారని చెప్పవచ్చు. ఎస్టీలకు రిజర్వు చేయడానికి మొదలు బళ్లారి, లోక్‌సభ నియోజకవర్గం 1952-1999 వరకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దాదాపు కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందడంతో అప్పటిలో బళ్లారి నియోజకవర్గాన్ని కాంగ్రెస్‌కు భద్రకోటగా నిలిచింది. అనంతరం 2000 సంవత్సరంలో రెడ్డి సోదరులు, బీజేపీ ప్రాబల్యంతో కాంగ్రెస్ కోటకు బీటలు వారడంతో కాంగ్రెస్ కంచుకోట కాస్త బీజేపీ పరమైంది. దీంతో 2004 నుంచి జరిగిన నాలుగు సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థే ఈ లోక్‌సభ స్థానానికి ఎన్నికవుతూ వచ్చారు. 1999లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, మాజీ కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్‌ను ఓడించడంతో బళ్లారి లోక్‌సభ నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షించింది.

- ప్రస్తుతం లోక్‌సభకు శ్రీరాములు, సండూరుకు చెందిన ఈ.తుకారం పోటీపడుతుండగా, కాంగ్రెస్ పార్టీ విజయానికి గ్యారెంటీ పథకాలమీదే ఆధారపడిందని చెప్పవచ్చు. ప్రస్తుతం బళ్లారి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీకి చెందిన ఒక ఎమ్మెల్యే మాత్రమే ఉండడం పెద్ద సవాల్‌గా మారింది. శాసనసభ ఎన్నికల్లో జిల్లాలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణానాయక్ మాత్రమే గెలుపొందారు.
- మాజీ మంత్రి, గనుల యజమాని గాలి జనార్దన్ రెడ్డి 2023 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ నుండి బయటకు వచ్చి సొంత పార్టీ స్థాపించారు. ఇది బీజేపీ ఓటమికి కారణంగా చెప్పవచ్చు. ప్రస్తుతం గాలి జనార్దన్ రెడ్డి మళ్ళీ బీజేపీలో చేరడంతో జిల్లాలో బీజేపీకి పూర్వ వైభవం వస్తుందని పార్టీ అధిష్టానం భావిస్తోంది. అదేరీతిలో 2019లో గెలుపొందిన బళ్లారి లోక్‌సభ నియోజకవర్గాన్ని తిరిగి దక్కించుకునే దిశలో కృషి చేస్తోంది. కొప్పళ జిల్లా పరిధిలోని గంగావతికి ప్రాతినిథ్యం వహిస్తున్న గాలి జనార్దన్ రెడ్డి, బళ్లారి ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం లేదు. కారణం అక్రమ గనుల కేసుకు సంబంధించి బళ్లారిలో ప్రవేశించడానికి సుప్రీం కోర్టు నిర్బంధం విధించింది.
- బళ్లారి లోక్‌సభ స్థానాన్ని దక్కించుకునేందుకు ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్ అభ్యర్థి తుకారం విజయానికి శాయశక్తులా కృషి చేస్తుండగా, బీజేపీ మాత్రం ఎస్టీ ఓటర్లతో పాటు లింగాయత ఓటర్లు తమకే మద్దతు పలుకుతారని ఆశాభావంలో ఉంది. తుకారం మాత్రం మైనార్టీ, కురుబలు, ఎస్సీలతో ఇతరుల ఓట్లు తప్పకుండా తనకే మద్దతు పలుకుతారని, ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా గెలుపు సాధిస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. తుకారం గెలుపొందితే సండూరు నియోజకవర్గంలో ఉప ఎన్నికలు జరుగక తప్పదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బళ్లారి కోట





ఓటు ప్రాధాన్యం వివరించే ప్లకార్డులతో దంపతులు, అతిథులు

వివాహం..వినూత్నం..

వివాహ వేడుకల్లో వినూత్న సందేశాన్ని ఇచ్చారు ఆ దంపతులు.. దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ప్రజల్లో ఓటు ప్రాధాన్యం వివరిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించి చైతన్యం కలిగిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే కార్యక్రమంలో చేయి కలిపిన ఆ కుటుంబం అందరి ప్రశంసలు అందుకుంటోంది. హుబ్లీలోని రామకృష్ణ భాండగె, గంగూబాయి బాండగె దంపతులు తమ ద్వితీయ కుమారుడు విశాల్ వివాహాన్ని చెన్నపేటకు చెందిన ఎస్.ఎస్.కెహాల్‌లో ఆదివారం నిర్వహించారు. పెళ్లి వేడుకల్లో వధూవరులు ఓటు ప్రాధాన్యం తెలుపుతూ ప్లకార్డులు పట్టుకుని అతిథులకు జాగృతి కల్పించారు. ఓటు వేయడంపై నిర్లక్ష్యం వహించరాదని, బాధ్యతగా ఓటు వేసి ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. వివాహ ఆహ్వాన పత్రికల్లో సైతం ఓ వైపు వివాహ విశేషాలు ప్రచురించగా మరోవైపు ఓటు ప్రాధాన్యం వివరించడం ఆందరినీ ఆకట్టుకుంది. ఇకనైనా ఓటర్లు మేల్కొనాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఓటు ప్రాధాన్యం వివరిస్తూ ముద్రించిన ఆహ్వాన పత్రిక

స్పామ్ కాల్స్ ద్వారా ఎన్నికల ప్రచారం

అనంతపురం అర్బన్: సోషల్ మీడియా ద్వారా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అధికార, ప్రధాన ప్రతిపక్షాలతో పాటు ఇతర పార్టీలు ఇప్పటికే వాట్సాప్, యూట్యూబ్, ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ తదితర మాధ్యమాల ద్వారా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా స్పామ్ కాల్స్ ద్వారా ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాయి. తమ పార్టీకి ఓటు ఎందుకు వేయాలి? ఇతర పార్టీలకు ఎందుకు వేయకూడదో పాటల ద్వారా వివరిస్తున్నారు. కాల్ లిఫ్ట్ చేయగా తమ పార్టీకి ఓటు వేయాల్సిన ఆవశ్యకతను పాట రూపంలో వివరిస్తుండటంతో ఇదేం ట్రెండ్ రా బాబూ అంటూ ఒకింత ఆశ్చర్యపోతున్నారు.

మండ్యలో గెలుపెవరిదో..?

- కుమార వర్సెస్ వెంకటరమణేగౌడ
- బీజేపీ మద్దతుతో జేడీఎస్‌లో నూతనోత్సాహం
- ఆరు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్‌దే ప్రాబల్యం
- హోరాహోరీ పోరుతో పెరిగిన ఉత్కంఠ

బెంగళూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. మండ్య జిల్లా అంటూనే అందరికి గుర్తుకువచ్చేది కోట్లాది మంది కన్నడిగుల జీవనది కావేరీ నదికి అనుబంధంగా ఉండే భారీ ప్రాజెక్టు కేఆర్‌ఎస్. జిల్లా అంతటా దశాబ్దాల కాలంగా పాడిపంటలతో అన్నపూర్ణగాను పేరుంది. వీటికే కాకుండా మండ్య అంటే రాజకీయాలకు ప్రత్యేకత ఉంది. కన్నడ నటుడు అంబరీష్ ను రాష్ట్ర, కేంద్రంలో మంత్రిని చేసిన ఘనత జిల్లాదే. గడిచిన ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన సుమలతా అంబరీష్‌ను అనూహ్యమైన మెజారిటీతో గెలిపించారు. కాంగ్రెస్- జేడీఎస్‌ల అప్పటి మైత్రి అభ్యర్థి దేవేగౌడ మనవడు, కుమారస్వామి వారసుడు నిఖిల్‌ను ఆత్మాభిమానం కోసం ఓడించారు.

- తొలి విడత జరిగే నియోజకవర్గాల్లో ప్రతిష్ఠాత్మకమైన వాటిలో మండ్య ఒకటి. ఇక్కడ మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి పోటీ చేస్తుండగా కాంగ్రెస్ నుంచి వెంకటరమణేగౌడ అలియాస్ స్టార్ చంద్రు పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఇక్కడ జేడీఎస్ అభ్యర్థిగా కుమారస్వామి కుమారుడు నిఖిల్ పోటీ చేయగా స్వతంత్ర అభ్యర్థి సుమలత పోటీ చేసి గెలుపొందారు. అనంతరం ఆమె బీజేపీకి మద్దతు ఇచ్చారు. మారిన రాజకీయాల నేపథ్యంలో బీజేపీ-జేడీఎస్ పొత్తు దరిమిలా ఉమ్మడి అభ్యర్థిగా హెచ్‌డీ కుమారస్వామి పోటీ చేస్తున్నారు. కుమారస్వామికి ప్రస్తుతం బీజేపీ బలం కూడా తోడైంది. సుమలత కూడా మద్దతు తెలిపింది. రాజకీయాల్లోకి కొత్తగా పారిశ్రామికవేత్త వెంకటరమణేగౌడను కాంగ్రెస్ బరిలోకి దింపింది. బెంగళూరులో బిల్డర్‌గా ఉన్న స్టార్ చంద్రు నాగమంగల తాలూకాకు చెందిన వ్యక్తి. సీఎం, డీసీఎంల చొరవతో రాజకీయాల్లోకి ప్రవేశించేలా చేశారు.
- మండ్య లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 8 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. మండ్య (కాంగ్రెస్), మద్దూరు (కాంగ్రెస్), మళవళ్ళి (కాంగ్రెస్), శ్రీరంగపట్టణ (కాంగ్రెస్), నాగమంగల (కాంగ్రెస్), కేఆర్‌నగర్ (కాంగ్రెస్), మేలుకోటె (సర్వోదయ కర్ణాటక పార్టీ), కేఆర్ పేట (జేడీఎస్)ల ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. లోక్‌సభ పరిధిలో 17,78,239 మంది మొత్తం ఓటర్లు ఉండగా మహిళలు 9,02,958 మంది, పురుషులు 8,76,112మంది, ట్రాన్స్‌జెండర్లు 168మంది ఉన్నారు.



కుమారస్వామి



మండ్య లోక్‌సభ మ్యాప్

గ్యారెంటీ పథకాలు

- మండ్య లోక్‌సభ పరిధిలో 8 శాసనసభ నియోజక వర్గాలకుగాను 6 చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడం కాంగ్రెస్‌కు కలసి వచ్చే అంశం. ఇక్కడ ఆదినుంచి కాంగ్రెస్, జేడీఎస్ మధ్య బలమైన పోరు ఉంది. గతంలో ఎంపీగా అత్యధికసార్లు కాంగ్రెస్ వారే గెలుపొందారు. ఎంకే శివనంజప్ప నాలుగుసార్లు, ఎస్ఎం కృష్ణ, ఎంహెచ్ అంబరీశ్ తలా 3సార్లు, జీ మాదేగౌడ, కే చొక్కలింగయ్య తలా రెండుసార్లు, కేవీ శంకర్ గౌడ, మాజీ స్పీకర్ కేఆర్ పేటె కృష్ణ, ఎన్ చలువరాయస్వామి, రమ్యా, సీఎస్ పుట్టరాజు, ఆర్ఆర్ శివరామేగౌడ, సుమలతా అంబరీశ్ తలా ఒకసారి ప్రాతినిథ్యం వహించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరమణేగౌడకు మరింత బలం కానుంది. మహిళల సానుకూలత కలసివచ్చే అంశాలు. జిల్లాలో కాంగ్రెస్‌లో ఐక్యత కనిపిస్తోంది. రెండు నెలలుగా అభ్యర్థి ప్రచారంలో చురుగ్గా ఉన్నారు. ఇక్కడ రాహుల్‌గాంధీ ప్రచారం చేశారు. అయితే బీజేపీ-జేడీఎస్‌ల పొత్తు పెను సవాల్ కానుంది. కాగా ప్రాజెక్టుల్లో నీరు కొరత కారణంగా స్థానిక కాలువలకు నీరు వదులక పోవడం, స్థానికేతరుడు కావడం వ్యతిరేక అంశాలు.



వెంకటరమణేగౌడ

సానుభూతి పవనాలు

- జేడీఎస్-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఉన్న కుమారస్వామికి నియోజకవర్గంలో ఒక్కలిగల మద్దతు కలసి వచ్చే విషయం. గత ఎన్నికల్లో కుమారుడు నిఖిల్ ఓటమి చెందిన అంశంతో ప్రజలు సానుభూతి చూపుతారని భావిస్తున్నారు. ఉమ్మడి అభ్యర్థి కావడంతో మోదీ చరిష్మా, మాజీ ప్రధాని దేవేగౌడ హవా పనిచేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా జేడీఎస్‌లోని భిన్నాభిప్రాయాలు, తరచూ నోరు జారి ఇష్టం వచ్చిన వ్యాఖ్యలు చేయడం మైనస్ అంశాలుగా ఉన్నాయి.

జనహితం నిజాం తత్వం

మంత్రైనా పైసా సంపాదించుకోని నిజాంవలి
కమ్యూనిస్టు నేతగా ప్రస్థానం.. కాంగ్రెస్‌నేతగా అస్తమయం



కదిరి, ఏప్రిల్ 21: ఆయన మార్గం అనన్య సామాన్యం. రాజకీయాల్లో సమున్నత స్థాయికి చేరినా ఉండటానికి ఇళ్లు, పని చేసుకోవడానికి సెంటు పొలం కూడా సంపాదించుకోని నిస్వార్థ ప్రజా సేవకుడు. ఆయనే మాజీ మంత్రి నిజాంవలి. ఎమ్మెల్యేగా 1978నుంచి 83వరకు పనిచేశారు. అదే కాలంలో మంత్రి కూడా అయ్యారు. ఆయన ప్రస్థానం కమ్యూనిస్టు పార్టీతో మూడిపడింది. కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలతో ప్రభావితమైన నిజాంవలి, కదిరిలోని సామాన్య ప్రజలకు సైతం సుపరిచితం. ఎన్నో ఆటుపోట్లు, మరెన్నో ఉద్యమ నిర్బంధాలు లెక్కచేయలేదు. నవాబు వంశస్తుడైనప్పటికీ అత్యంత సామాన్య జీవితాన్ని కొనసాగించారు. భూస్వామ్య పెత్తందార్లకు వ్యతిరేకంగా సామాన్యుల పక్షాన నిలిచి వారి గొంతుకయ్యారు. విప్లవ శిఖరం ఎస్ఎ రవూఫ్, నిజాంవలి ఇద్దరు కదిరి రాజకీయ చరిత్రలో ఉద్యమాలను కొనసాగించారు. శాశ్వత కీర్తిని గడించారు. కమ్యూనిస్టు పార్టీలో చీలిక వచ్చిన తరువాత నిజాంవలి కాంగ్రెస్‌లో చేరారు.

కదిరా.. మాస్కోనా..! ఆశ్చర్యపోయిన నెహ్రూ

నిజాంవలి కమ్యూనిస్టు నాయకుడిగా ఉన్న సమయంలో దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కదిరి పర్యటనకు వచ్చారు. ఆ సమయంలో కరువు తాండవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ కదిరి పట్టణాన్ని ఎర్ర జెండాలతో నింపేశారు. ఎరుపు మయమైన పట్టణాన్ని చూసిన నెహ్రూ ఇది కదిరా లేదా మాస్కోనా అని పార్టీ నాయకులతో ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు కొందరు వృద్ధ నాయకులు ఇప్పటికీ చెబుతారు. నిజాంవలి కమ్యూనిస్టు నాయకుడిగా ఉన్న సమయంలో ఆయన ఇంటిలో బంధువులు చనిపోగా శ్మశానవాటికలో స్థలం లేదని అంత్యక్రియలు చేయడానికి కొందరు నిరాకరించారు. ఆసమయంలో కదిరి ప్రజలందరూ ముందుండి శ్మశానవాటికి ద్వారాలు తెరిచి కార్యక్రమాలు పూర్తి చేయడం ఆయన పట్ల పట్టణ ప్రజలకు ఉన్న ప్రేమకు తార్కాణమని చెబుతుంటారు. తన జీవితం కాలం అంతా సామాన్యుల అభివృద్ధి కోసం శ్రమించిన నిజాంవలి కదిరి రాజకీయ ముఖచిత్రంలో మరువలేని నాయకుడు.

ఊర్లో ఇల్లు లేదు- అడవిలో చేనులేదు

మంత్రిగా పని చేసినా నిజాంవలికి కదిరి పట్టణంలో ఇళ్లు లేకపోగా, ఎక్కడేగాని సెంటు భూమి కూడా లేదు. ఆయన కుమారుడు ఎస్ఎం ముజఫర్‌అలీ కదిరి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం రాజకీయాలలో క్రియాశీలకంగా లేరు. మరో కుమారుడు ఓ దినపత్రికలో విలేకరిగా కొనసాగుతున్నారు. అంతే తప్ప ఆయన పిల్లలు ఎవరూ ఉన్నతస్థాయిలో లేరు.

కోడ్ ఉల్లంఘనలపై కొరడా

109 మందిపై వేటు
రాయదుర్గంలో అత్యధికం-కళ్యాణదుర్గంలో జీరో

అనంతపురం టౌన్, ఏప్రిల్ 21: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అధికార యంత్రాంగం కొరడా ఝుళిపిస్తోంది. షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకు 109 మందిపై కోడ్ ఉల్లంఘనలపై చర్యలు వేటు వేశారు. అనంతపురం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో వలంటీర్లు, డీలర్లు, రేషన్ సరఫరా చేసే ఎండీయూ ఆపరేటర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, రెగ్యులర్ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్‌కుమార్ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం అత్యధికంగా రాయదుర్గం నియోజకవర్గంలోనే 29 మందిపై ఉల్లంఘనల కింద వేటు వేసారు. ఇందులో వలంటీర్లు 23 మంది ఉండగా డీలర్లు నలుగురు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇద్దరు ఉన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 19 మందిపై వేటు పడగా వీరిలో వలంటీర్లు 14 మంది, డీలర్లు ఇద్దరు, కాంట్రాక్ ఉద్యోగులు ముగ్గురు చర్యలకు గురయ్యారు. గుంతకల్లు నియోజకవర్గంలో వలంటీర్లు ఆరుగురు, డీలర్లు ఇద్దరు చొప్పున 8 మందిపై వేటు పడింది. తాడిపత్రి నియోజకవర్గంలో 24మందిపై కోడ్ ఉల్లఘించినందులకు వేటు వేశారు. ఇందులో 11మంది వలంటీర్లు, 11మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు. శింగనమల నియోజకవర్గంలో 19మందిపై చర్యలు తీసుకోగా ఇందులో 10మంది వలంటీర్లు, ఇద్దరు డీలర్లు, ఐదుగురు కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటికి నలుగురిపై మాత్రమే చర్యలు తీసుకోగా వారిలో ముగ్గురు వలంటీర్లు ఉన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఆరుగురిపై వేటుపడగా వీరిలో వలంటీర్లు ముగ్గురు, డీలర్ ఒకరు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇద్దరు ఉన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఇప్పటి వరకు కోడ్ ఉల్లంఘనలపై ఒక్కరిపై కూడా చర్యలు లేకపోవడం విశేషం.

సి-విజిల్‌యాప్‌కు 419 ఫిర్యాదులు.. రూ 2,95,14,352 సీజ్



ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత నిబంధనల ఉల్లంఘనలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడానికి ఎన్నికల కమిషన్ సి-విజిల్ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌కు అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 419 ఫిర్యాదులు అందాయి. ఇందులో జిల్లా కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు 159 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో రాయదుర్గం నుంచి 39, ఉరవకొండ నుంచి 25, గుంతకల్లు నుంచి 37, తాడిపత్రి నుంచి 40, శింగనమల నుంచి 3, అనంతపురంఅర్బన్ నుంచి 43, కళ్యాణదుర్గం నుంచి 50, రాప్తాడు నుంచి 23 చొప్పున సి-విజిల్ యాప్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు ఒక వ్యక్తి వద్ద రూ.50వేలు వరకు మాత్రమే నగదు ఉండవచ్చు. అంతకన్నా ఎక్కువ నగదు తీసుకెళితే సీజ్ చేస్తారు. ఈ నిబంధనల మేరకు ఇప్పటి వరకు జిల్లాలో ప్రత్యేక బృందాల తనిఖీల్లో రూ.2,9514,352 నగదును సీజ్ చేశారు. ఆ డబ్బుకు ఆధారాలు చూపితే వెనక్కు ఇస్తారు.

పోరాటాల పురిటిగడ్డ

- సత్యాగ్రహ ఉద్యమంలో కీలకపాత్ర
- భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు
- నీలం, తరిమెలను అందించిన నేల
- మిడ్ పెన్నార్ డ్యాం ఉన్నా.. నీటి కష్టాలు
- ఇదీ.. శింగనమల చరిత

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 21 : దేశంలో కొనసాగుతున్న ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. విప్లవాల పురటిగడ్డగా శింగనమల నియోజకవర్గం వినపడుతుంది. ఇలాంటి ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, టీడీపీ ఐదు సార్లు గెలుపొందాయి. సీపీఐ, జనతా, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో భూస్వాములుకు వ్యతిరేకంగా శ్రామికులు, కూలీల కోసం తరిమెల నాగిరెడ్డి ఈ ప్రాంతం నుంచి అనేక పోరాటాలకు శ్రీకారం చుట్టారు. 1955లో తొలుత పుట్లూరు నియోజకవర్గం కేంద్రంగా ఏర్పాటయింది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 1967లో శింగనమల కేంద్రంగా నియోజకవర్గం ఏర్పాటయింది. ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 14సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. శింగనమల నియోజకవర్గం ఎక్కువ శాతం వ్యవసాయ పంటల మీద జీవనం సాగిస్తారు. రెండో స్థానంలో గృహనిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రాష్ట్రంలోనే చీని పంటలకు నిలయం. శింగనమల నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి అత్యధికంగా 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కొత్తపల్లి జయరాం 47,198 ఓట్లతో విజయం సాధించారు. 1962లో అత్యల్పంగా 962 ఓట్లతో స్వతంత్ర అభ్యర్థిగా తరిమెల నాగిరెడ్డి గెలుపొందారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 5 సార్లు, కాంగ్రెస్ 5 సార్లు, వైసీపీ ఒకసారి విజయం సాధించాయి.

తొలి ఎమ్మెల్యే స్వాతంత్ర్య సమర యోధుడు

శింగనమల నియోజకవర్గం కాక ముందు పుట్లూరు నియోజకవర్గం తొలి ఎమ్మెల్యేగా స్వాతంత్ర సమర యొధుడు తరిమెల రామచంద్రారెడ్డి ఎన్నికయ్యారు. స్వయాన తన బంధువు తరిమెల నాగిరెడ్డిపై విజయం సాధించారు. తమిళనాడు రాష్ట్రం తిరుచానారులో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వంపై తిరగబడి జైలుకు వెళ్లారు. విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు, సేవా కార్యక్రమాలు చేపట్టేవారు. 1955లో తొలిసారి కాంగ్రెస్ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. తరిమెల రామచంద్రారెడ్డి శింగనమల మండలం తరిమెల గ్రామంలో 1915లో జన్మించారు. 1967లో శింగనమల నియోజకవర్గం ఏర్పడిన తొలిసారి ఎమ్మెల్యేగా కె. చిన్నశ్రీరంగయ్య కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు.

నీటి వనరులు

నియోజకవర్గంలో ప్రధానంగా గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల గ్రామంలో మిడ్‌పెన్నార్ డ్యాం ఉంది. ఈ డ్యాం ద్వారా నియోజకవర్గంలోని హెచ్చెల్సీ కాలువ ద్వారా గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో దాదాపు 47 వేల ఎకరాలకు రబీసీజన్‌లో పంటలకు సాగు నీరు వస్తుంది. వీటితో పాటు బుక్కరాయసముద్రం, శింగనమల చెరువులు అతి పెద్దవిగా ఉన్నాయి. నియోజకవర్గం వ్యాప్తంగా మైనర్ ఇరిగేషన్ చెరువులు 45 ఉన్నాయి.

ప్రధాన సమస్యలు

శింగనమల నియోజకవర్గంలో ప్రధానంగా సాగునీటి సమస్యతో రైతులు అల్లాడిపోతున్నారు. ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి 45 చెరువులకు హంద్రీనీవా ద్వారా నీటి కేటాయింపులు చేస్తూ ప్రత్యేక జీవో విడుదల చేయించారు. వీటితో పాటు శింగనమల చెరువు లోకల్‌జైషన్ చేసినట్లు ఆర్భాటంగా ప్రచార చేసుకున్నారు. ఆచరణలో ఎక్కడ అమలు కాలేదు. రెండు సంవత్సరాల నుంచి రైతులు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఒక్క చెరువుకు నీరు విడుదల చేయించిన పాపాన పోలేదు. ఎంపీఆర్‌డ్యాం రెండు గేట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డ్యాం గేట్ల మరమ్మతులు చేయించలేదు. దీంతో నీరంతా వృ థాగా వెళ్లాయి. గ్రామాల్లో టీడీపీ హయాంలో వేసిన రోడ్లే దర్శనమిస్తాయి. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఇప్పటికి అ నేక గ్రామాలకు ప్రధాన రహదారులు లేక ప్రజలు నానా అవస్థ లు పడుతున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. వీటికి తోడు పలు గ్రామాలను తాగునీటి సమస్య గ్రామాల్లో వెంటాడుతోంది.

మిడ్‌పెన్నార్ డ్యాం



ప్రముఖ పుణ్యక్షేత్రాలు

నియోజకవర్గంలోని నార్పల మండలం గూగూడు గ్రామంలో మొహరం వేడుకలు రాష్ట్రంలోనే అంగరంగ వైభవంగా జరుగుతాయి. అతిపురాతణమైన బుక్కరాయసముద్రంలోని కొండమీదరాయుడు స్వామి, గార్లదిన్నె మండలజ కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుర్తింపు పొందాయి.

● ప్రధాన సంస్థలు

శింగనమల నియోజకవర్గంలో ప్రధానంగా సెంట్రల్ యూనివర్సిటీ, ఓపెన్ ఎయిర్ జైలు, జిల్లా జైలు, ఏపీఎస్పీ పోలీసు 14వ బెటాలియన్, కృషివిజ్ఞాన కేంద్రం, రేకలకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం, వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ, గడ్డివిత్తనోత్పత్తి కార్యాలయం ప్రసిద్ధి పొందాయి.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

ఇమ్మానుయేల్ కాంట్ (జయంతి)



జర్మన్ దేశానికి చెందిన ప్రముఖ తత్వవేత్త ఇమ్మానుయేల్ కాంట్ 1724 ఏప్రిల్ 22న జన్మించారు. ఈయన ప్రభావం హెగెల్, కార్ల్‌మార్క్స్‌పై కూడా ఉంది. ఈయన కొంతవరకు గతి తర్కాన్ని కూడా అంగీకరించారు. భావవాదం, జడతత్వ శాస్త్రంపై మొగ్గు చూపారు. విలువలు, ధార్మిక, న్యాయ, ఖగోళశాస్త్రం, చరిత్రపై పలు అంశాలను ప్రచురించారు. ఆయన రచించిన యూనివర్శల్ నేచురల్ హిస్టరీ (1755), క్రిటిక్ ఆఫ్ ప్రాక్టికల్ రీజన్, తదితర పుస్తకాలు ఎంతో పేరొందాయి. 1804 ఫిబ్రవరి 12న కన్నుమూశారు.

రామనాథ్ గోయెంకా (జయంతి)



రామనాథ్ గోయెంకా 1904 ఏప్రిల్ 22న బీహార్ రాష్ట్రం దర్భంగాలో జన్మించారు. 1932 లో 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'ను పత్రికను స్థాపించారు. ఆంగ్ల, తదితర స్థానిక భాషలలో ప్రచురితం అవుతోంది. 1941లో నేషనల్ న్యూస్‌పేపర్ ఎడిటర్స్ కాన్ఫరెన్స్‌లో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2000లో ఇండియాటుడే '100 పీపుల్ హూ షేప్డ్ ఇండియా' జాబితాలో చోటు పొందారు. 1991 అక్టోబరు 5న కన్నుమూశారు. పాత్రికేయ రంగానికి వన్నె తెచ్చినందుకుగాను ఆయన జ్ఞాపకార్థం ఈ రంగంలో రాణించినవారికి ఏటా పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు.

మార్కస్ బార్ట్‌లే (జయంతి)



మార్కస్ బార్ట్‌లే 1917 ఏప్రిల్ 22న మహారాష్ట్రలో జన్మించారు. ఆంగ్లో ఇండియన్ సినిమాటోగ్రాఫర్. పాతాళభైరవి, మాయాబజార్, చెమ్మీన్ వంటి క్లాజిక్ సినిమాలకు ఛాయా చిత్రగ్రాహకుడిగా వ్యవహరించి జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకున్నారు. నేషనల్ స్టూడియోస్, న్యూటోన్ స్టూడియోస్, వాహిని ప్రొడక్షన్స్ వంటి సంస్థలలో పనిచేశారు. 'స్వర్గసీమ' సినిమాతో తెలుగు సినీరంగంలోకి ప్రవేశించారు. 1970లో తమిళంలో 'శాంతి నివాసం'కు ఉత్తమ ఛాయాగ్రాహకుడి పురస్కారం పొందారు. 1978లో కేన్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'చెమ్మీన్' మళయాళ సినిమాకు బంగారు పతకం పొందిన ఏకైక సినిమాటోగ్రాఫర్. 1993 ఏప్రిల్ 14న కన్నుమూశారు.

బాల్కి (పుట్టినరోజు)



సినీ దర్శకుడు, నిర్మాత, స్క్రీన్‌రైటర్‌గా రాణించిన ఆర్ బాలకృష్ణన్ 1965 ఏప్రిల్ 22న తమిళనాడు రాష్ట్రం కుంబకోణంలో జన్మించారు. ప్రకటనల ఏజెన్సీ లోవె లింటాస్ గ్రూప్‌కు మాజీ చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన దర్శకత్వం వహించిన 'పా' హిందీ సినిమా జాతీయస్థాయిలో ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా పేరొందింది. 'పాడ్‌మ్యాన్'కు ఉత్తమ దర్శకుడిగా గుర్తింపు పొందారు. చీనీ కుం, పా, మిషన్ మంగల్ తదితర సినిమాలు ఎంతో పేరొందాయి. సామాజిక సమస్యలపై ఆయన సినిమాలు రూపొందించారు.


చేతన్ భగత్ (పుట్టినరోజు)



చేతన్ భగత్ 1974 ఏప్రిల్ 22న న్యూ ఢిల్లీలో జన్మించారు. రచయిత, కాలమిస్టు, స్క్రీన్‌ప్లే, టెలివిజన్ ప్రముఖులు, వక్త. ఆంగ్లంలో ఈయన రాసిన నవలలు యువతకు చాలా చేరువయ్యాయి. వీటిలో ఐదు నవలలో బాలీవుడ్‌లో సినిమాలుగా రూపు దిద్దుకున్నాయి. కాగా ది టైమ్స్ ఆఫ్ ఇండియా, దైనిక్ భాస్కర్ పత్రికలలో యువత, కెరీర్ గురించి, సమకాలీన అంశాలపైనా శీర్షికలు రాస్తుంటారు. ఫిల్మ్‌ఫేర్ అవార్డు పొందారు. ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో సీఎన్ఎన్ ఐబీఎన్ ఇండియన్ ఆఫ్ ది ఇయర్ 2014 పురస్కారం అందుకున్నారు. 2022లో గోల్డెన్‌బుక్ అవార్డ్ అందుకున్నారు.

రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్లు ఇచ్చాం

- యూపీఏ పాలనలో పదేళ్లకు రూ.80వేల కోట్లే
- అరబ్ ఎమిరేట్స్‌లో అరకోటిమంది భారతీయులు
- మూడు దశాబ్దాలలో ఒక్కప్రధాని వెళ్లలేదు
- అవినీతి దేశాన్ని నాశనం చేసింది
- రాజకీయం కోసమే కరువుసాయంపై కోర్టుకు
- ప్రధాని నరేంద్రమోదీ



ప్రధాని నరేంద్ర మోదీ

బెంగళూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు పదేళ్ల ఎన్డీయే పాలనలో సుమారు 3 లక్షల కోట్లు గ్రాంట్లు కేటాయించామని అంతకుముందు పదేళ్ల యూపీఏ మన్మోహన్ సింగ్ పాలనలో రూ.80వేల కోట్లు మాత్రమే రాష్ట్రానికి దక్కాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. కర్ణాటక ఎన్నికల ప్రచారం కోసం శనివారం బెంగళూరుకు వచ్చిన సందర్భంలో ఓ కన్నడ మీడియా సంస్థతో ప్రధాని ప్రత్యేకంగా మాట్లాడారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం మేం చెల్లించిన పన్ను కేంద్రం నుంచి వాపసు రావడం లేదని చేస్తున్న పోరాటంపై స్పందించారు. మనమంతా భారత మాత సేవలో ఉన్నామని, వ్యవస్థలు, విధులు వేర్వేరు అయినా లక్ష్యం ఒక్కటే ఉండాలన్నారు. కర్ణాటకలో ఓ పథకానికి అర్హుడైన లబ్ధిదారుడు ఉంటే అతడికి అందాల్సిందేనని, ఇది రాజ్యాంగం మూల ఉద్దేశ్యమన్నారు. హిమాలయాల్లో నదులు ప్రవహిస్తాయని ఆ నీరు ఎవరూ ఉపయోగించరని అంటే దేశంలో పాలన సాధ్యమా అన్నారు. ఈ వ్యవస్థ రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగానే నడుస్తుందన్నారు. రాష్ట్రాలకు 32శాతం గ్రాంట్లు కేటాయింపు ఉండేదని, 14వ ఫైనాన్స్ కమిషన్ 42శాతానికి పెంచిందని ఇది నాపై ఒత్తిడి వచ్చిందన్నారు. కేంద్రంలో అధికారం ఉందని తద్వారా కొంచెం మార్పులకు పార్లమెంటుకు అధికారం ఉండేదన్నారు. కేరళకు యూపీఏ హయాంలో 46వేల కోట్లు మాత్రమే ఇచ్చారని, మా పాలనలో రూ.1.5 లక్షల కోట్లు కేటాయించామన్నారు. తమిళనాడు యూపీఏ ప్రభుత్వంలో ఉన్నా రూ.95వేల కోట్లు మాత్రమే ఇచ్చారని, ప్రస్తుతం వారికి దాదాపు రూ.3 లక్షల కోట్లు కేటాయించామన్నారు. స్వార్థ రాజకీయాలకోసం ద్వేషాన్ని సృష్టిస్తున్నారని, ఐదారు దశాబ్దాలు కాంగ్రెస్ తన నీచబుద్ధిని చూపారన్నారు.

25 కాంగ్రెస్ గ్యారెంటీలపై

నిరాశ, మునిగిపోతున్న రాజకీయ పార్టీ అందరికీ ప్రేమ పంచేందుకు కష్టపడుతోందని, నేను నా గురించి మాత్రమే మాట్లాడతానన్నారు. సుదీర్ఘకాలం గుజరాత్ సీఎంగా ఉన్నానని ప్రస్తుతం పదేళ్లుగా ప్రధానమంత్రిగా పనిచేసే అవకాశం లభించిందన్నారు. నాకు ఎంతో అనుభవం ఉందని, మనం ఎప్పుడూ కూడా మన దేశపౌరుల సామర్థ్యం పట్ల అనుమానం చూపరాదన్నారు. ఎర్రకోట నుంచి ఓసారి ఎవరికి సామర్థ్యం ఉందో వారంతా గ్యాస్ సబ్సిడీ వదులుకోవాలని పిలుపునిస్తే సుమారు 1కోటిమందికిపైగా ముందుకొచ్చారన్నారు. కోవిడ్ వేళ పార్లమెంటులో ఎంపీలకు మీ వేతనాలను వదులుకోవాలని పిలుపుతో సభ్యులందరూ సిద్ధమయ్యారన్నారు. ఇటువంటి అంశాలు ప్రేరణ ఇస్తాయని పేదలను కష్టకాలంలో ఆదుకోవాలని, దేశ ప్రజ లకు చేయి పట్టుకుని ముందుకెళ్లాలని ప్రతి వ్యక్తికి సొంత శక్తిపై నిలబడేలా చేయాలన్నారు. 11 జన ఔషధి కేంద్రాల ద్వారా అవసరమైన మందులు 80శాతం రాయితీతో ఇస్తున్నామన్నారు. సోలార్ ప్యానెల్ వేస్తే కరెంటు చార్జీ ఉండదని, అన్నింటికీ సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు. ఐదు దశాబ్దాలు గరీబీ హఠావోతోనే గడిపారన్నారు. ఇటీవల పదేళ్లలో 25 కోట్ల మంది దారిద్ర్యరేఖకు ఎగువకు చేరారన్నారు. నేను దేశ సామాన్య ప్రజలపై ఎక్కువ ఆశయాలు పెట్టుకున్నా అన్నారు. పరోక్షంగా గ్యారెంటీలను ప్రస్తావించకుండానే కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను తిప్పికొట్టారు.

విభజనను తీవ్రంగా పరిగణించాలి

రాజకీయ పార్టీలు రాజ్యాంగానికి అర్పించాలని, ఏక్తా, సమైక్యత బాధ్యత ఇస్తుందన్నారు. ఎవరైనా విభజన గురించి మాట్లాడితే రాజకీయ పార్టీలు తీవ్రంగా పరిగణించాలన్నారు. వారి ఆలోచన సక్రమంగా ఉండాలన్నారు. విభజన వ్యాఖ్యలు దేశానికి ప్రమాదకరమన్నారు. నేను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు కేంద్రం నుంచి అన్యాయం జరిగిందని అయితే భారత్ వికాస్ లక్ష్యంగా ఉండాలని అనుకున్నా అన్నారు. అందరూ సమష్టిగా నిర్ణయం తీసుకుంటేనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ విషయంలో ఎటువంటి రాజీలు ఉండవన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ కరువు పరిహారానికై సుప్రీంకోర్టును ఆశ్రయించడంపై మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితమే ఓ వ్యవస్థను రూపొందించారని అందుకు అనుగుణంగానే ప్రక్రియ సాగుతుందన్నారు. అతివృష్టి అనావృష్టి వేళ ప్రజలను కాపాడుకోవడం ముఖ్యమని, రాజకీయాలు కాదన్నారు. రూ.900 కోట్ల రూపాయలు ఇటువంటి సందర్భాల కోసమే కేటాయించామని ఇది బాకీ కాదన్నారు. కరువు అయినా అతివృష్టి అయినా వాటికి సంబంధించిన బృందాలు సర్వే చేసి నివేదిక ఇస్తారని, ఆ మేరకు నిపుణులు ఉండే కమిటీ నిర్ణయిస్తారని ఇందులో రాజకీయ నాయకులు ఉండరన్నారు. 900 కోట్లకంటే ఎక్కువ ఇవ్వాల్సి ఉంటే వారే నిర్ణయం తీసుకుంటారన్నారు. కేంద్రం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసిందని, క్లిష్ట సమయంలో పరిహారం ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కోరామన్నారు. ప్రస్తుతం రాజకీయాల కోసం సుప్రీంకోర్టులో పిటీషన్ వేయడం ఓ ఫ్యాషన్‌గా మారిందన్నారు. కేరళ వాసులు వెళ్లారని కోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. రాజకీయ లబ్ధి కోసం చేస్తున్నారనేది ప్రజలు గుర్తించాలన్నారు. ప్రజలకు ఈ కుట్రలను మీడియా వివరించాలన్నారు. దేశానికి నష్టం కలగకూడదన్నారు.

విదేశాలతో సత్సంబంధాలకు ప్రాధాన్యం

గత ప్రభుత్వాలు మధ్యప్రాచ్య దేశాలతో ఉత్తమ సంబంధాలకు ప్రాధాన్యత ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండే పనులు చేశారని ముడి చమురు దిగుమతి, తక్కువ సొమ్ముకే మానవ వనరుల ఎగుమతి జరిగిందన్నారు. ప్రస్తుతం మన రహదారి బలమైనదని కొనుగోలు దారులు, విక్రేతల మధ్య ఒప్పందాలు జరిగాయన్నారు. ఆహార సంస్కరణ కోసం వారు పెట్టుబడులు పెడుతున్నారన్నారు. ప్రధాని అయ్యాక 2015లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు వెళ్లానని అక్కడ 30-50 లక్షలమంది ప్రవాస భారతీయులు ఉన్నారని, కేరళ వాసులు అత్యధికమన్నారు. 30ఏళ్లలో ఒక ప్రధాని ఆ దేశానికి వెళ్లలేదన్నారు. మన అన్న చెల్లెళ్లు అక్కడ పనిచేస్తున్నారు, వారు ఎలా ఉన్నారనేది తెలుసుకోలేదన్నారు. పదేళ్లలో 13సార్లు మధ్య ప్రాచ్య దేశాలకు వెళ్లానన్నారు. అక్కడివారు మోదీ జీ ఇక్కడి భారతీయులు మా సహోదరులంటూ ప్రకటించారన్నారు. యెమెన్‌లో యుద్ధం ఆరంభమైనప్పుడు 5వేలమంది యూఏఈకు తెచ్చామని, ఆ తర్వాత వారిని ముంబైకు రప్పించామన్నారు. 2023లో సూడాన్‌లో అంతర్గత అంశాలపై సైన్యాల మధ్య యుద్ధం జరిగితే భారతీయులను వాపసు తెచ్చామన్నారు. సౌదీ జైళ్లలో 850మంది భారతీయులు ఉండేవారని నా మనవి మేరకు సౌదీ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఖత్తార్‌లో 8మంది మాజీ సౌకా సిబ్బందికి ఉరి శిక్ష పడితే రాజు క్షమాభిక్ష పెట్టారని, ఇది విదేశాలతో సత్సంబంధాల ద్వారానే సాధ్యమైందన్నారు. ఉక్రెయిన్ నుంచి ఎంతోమందిని వాపసు తీసుకొచ్చామన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో ప్రయోజనం

దేశమంతటా కుటుంబంలో ఒకరికి చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా తీవ్రంగా నష్టపోయేవారని, ఆయుష్మాన్ భారత్‌తో 70 కోట్లమందికి ఉత్తతమమైన ఆరోగ్య సేవలు సాధ్యం చేశామన్నారు. 2014లో కేంద్రప్రభుత్వం ఒక వ్యక్తికి రూ.1100 ఖర్చు చేసేదని, మే రెండింతలు చేశామన్నారు. 70ఏళ్లలో 387 మెడికల్ కళాశాలలో మాత్రమే ఉండేవని, పదేళ్లలో ఆ సంఖ్య 706కు పెరిగిందన్నారు. విద్య, వైద్యంకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నేను బంధనంలో జీవించే వ్యక్తి కాదని, కొత్త అంశాలు తెలుసుకునేందుకు చర్చించేందుకు నాకు ఆసక్తి అన్నారు. 2012లో గూగుల్ హ్యాంగఅవుట్స్ చేశానని అప్పట్లో చాలామందికి తెలియదన్నారు. త్రీడీ హోలోగ్రామ్ ఏం చేస్తుందనేది తెలుసుకున్నా అన్నారు. నమ్మ నమో ఇన్ కన్నడ, మళయాళం, తమిళ్ లాంటివి వాడతానన్నారు. నేను హిందీలో ఏఐ ఉపయోగిస్తానని, నా యాప్ కూడా ఏఐకు అనుబంధమైనదన్నారు. దేశంలో వీఐపీ సంస్కృతి రూపుమాపాలన్నారు. ఒకరికి ఒక న్యాయం, సామాన్యులకు మరో న్యాయం అనే విధానం మారాలన్నారు. గుజరాత్‌లో సీఎంగా ఉన్నప్పుడే ట్రాఫిక్ జామ్ అయితే ఎర్రబుగ్గ సైరన్‌లు బంద్ చేయాలని, మీరేం బాద్‌షాలు కాదని సూచించానన్నారు. నేను విశ్వసిస్తున్నా అని మనమెవ్వరూ వీఐపీలు కాదన్నారు. ఎవర్ పర్సన్ ఈజ్ ఇంపార్టెంట్ అన్నారు. కోవిడ్ వ్యాక్సినేషన్‌తో అందరినీ సమానం చేశాం, నా నెంబరు ఎప్పుడు వస్తే అప్పుడే టీకా వేశాం. నా తల్లికి వందేళ్లు, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి టీకా వేయించుకున్నాం, నా తల్లి చివరి దాకా ఆసుపత్రికి వెళ్లలేదు. చిట్టచివరి వేళ వెళ్లారు. నా తల్లి అంత్య క్రియలు సామాన్యుల తరహాలోనే చేశాం. వీఐపీ సంస్కృతికి నేను వ్యతిరేకమన్నారు. రిపబ్లిక్ డేలో 50మందికి ప్రత్యేక కుర్చీలు కోరుతా. వారంతా నా అతిథులు. వారంతా దేశంలో సామాన్యమైన వ్యక్తులై ఉంటారు. మన్ కీ బాత్‌లో సమా జం కోసం పాటుపడిన ఎంతోమందిని పరిచయం చేశామ న్నారు. ఇదో పెద్ద దేశమని ఈ దేశానికి ఓ శక్తి ఉందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు ప్రత్యేకించి యువత తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రకృతి నుంచే ఆరోగ్యం సుగమం

- డాక్టర్ బీడీ పాటిల్‌కు హోమియో ద్రోణాచార్య పురస్కారం



హోమియో ద్రోణాచార్య పురస్కారంతో సన్మానం

బెంగళూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రకృతి నుంచి ప్రకృతిలో వచ్చే ఆరోగ్య సమస్యలు సుగమం చేయడం సాధ్యమని హోమియోపతి నిర్ధారించిదని కర్ణాటక క్వాలిఫైడ్ హోమియోపతి డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపాద హెగ్డే అభిప్రాయపడ్డారు. గాంధీభవన్‌లో ఆదివారం హోమియోపతి దినోత్సవాన్ని నిర్వహించారు. హోమియోపతి రంగంలో అపార అనుభవం కల్గిన డాక్టర్ బీడీ పాటిల్‌కు హోమియో ద్రోణాచార్య పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యులుగా హాజరైన రాజీవ్‌గాంధీ వైద్య విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ చంద్రశేఖర్ శెట్టి మాట్లాడుతూ సమాజానికి గుణాత్మకమైన వైద్యం అవసరమన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందామని చెప్పుకుంటున్నా ప్రకృతి ద్వారానే కొన్ని ఆరోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నామన్నారు. వైద్య విధానంలో అనుభవం, ఓపిక, పరిశోధనలు ముఖ్యమన్నారు. కార్యక్రమానికి భగవాన్ బుద్ధ కళాశాల ముఖ్యులు చంద్రశేఖర్, తెలంగాణ రాష్ట్రం హంస హోమియో కళాశాల ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ ఉమేశ్ అక్కులదేవి, ఆగ్రా నుంచి నైమంత్ హోమియోపతి మెడికల్ కళాశాల చైర్మన్ డాక్టర్ ప్రదీప్ కుమార్ గుప్త, కన్యాకుమారి నుంచి ప్రొఫెసర్ డాక్టర్ విన్సస్ వర్గీస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలనుంచి హోమియో నిపుణులు భాగస్వామ్యులయ్యారు. అధ్యక్షుడు శ్రీపాదహెగ్డే మాట్లాడుతూ హోమియో విధానంలో మార్పులు ఉండవని అది స్టాండర్డ్‌గా ఉంటుందని ప్రకృతి నుంచి ప్రకృతి ఉపశమనం అనే విధానం అన్నారు. జాతీయ సదస్సు ద్వారా హోమియో కోర్సులు చేస్తున్నవారికి సీనియర్ల అనుభవాలు, వారి వైద్యవిధానం ఎంతో అనుకూలం కానుందన్నారు. అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ హెచ్ఎన్ స్వామి, కార్యదర్శి చిరాంత్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఉచిత చికిత్సా శిబిరం



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తూ...

బొమ్మనహళ్ళి, ఏప్రిల్ 21: ఏపీజే అబ్దుల్‌కలాం సేవా సమితి ఆధ్వర్యంలో జేపీ నగర్‌లో ఆదివారం ఉచిత చికిత్సా శిబిరం నిర్వహించింది. శిబిరాన్ని సమితి అధ్యక్షురాలు శాలిని గిరీ పర్యవేక్షించారు. కిద్వాయ్, జయదేవ ఆసుపత్రులకు చెందిన వైద్యులు పాల్గొని బీపీ, షుగర్, ఈసీజీ తదితర సమస్యలపై పరిశీలనలు చేశారు. శిబిరం ద్వారా 220మందికిపైగా ప్రయోజనం పొందారు. అత్యవసరమైన వారికి సంబంధిత కిద్వాయ్ లేదా జయదేవ ఆసుపత్రులలో అంబులెన్స్‌లో తరలించే సదుపాయం ఉందని నిర్వాహకులు తెలిపారు. సమితి ఆధ్వర్యంలో 9ఏళ్లుగా సామాజిక సేవలు కొనసాగుతున్నాయన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో శిబిరాలు కొనసాగిస్తున్నట్టు తెలిపారు. శిబిరం ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 3వరకు కొనసాగింది. ఎక్కువమందికి వైద్యం అందేలా తరచూ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా పటాలమ్మదేవి ఉత్సవాలు



పటాలమ్మ దేవి, వీరసొణ్ణమ్మదేవిలు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 21: తాలూకాలోని వరద నాయకనహళ్ళి గ్రామంలో కొలువైన పటాలమ్మదేవి, వీర సొణ్ణమ్మ దేవి 28వ వార్షిక ఆలయ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం జరిగింది. మహిళలు, పెద్దలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కీలుగుర్రాలు, గారడీబొమ్మల వేషధారణలు సందడి చేశాయి. ఆలయం వద్ద బత్తాసు, బొరుగులు, ఖారా, తిండి పదార్థాలు, ఇతర ఆటల సామగ్రి విక్రయాలు సాగాయి. ఉత్సవం అనంతరం తీర్థ ప్రసాద వినియోగం, అన్న సంతర్పణ నిర్వహించారు. రథోత్సవం వేళ భక్తులకు పానకం, మజ్జిగ, పెసరపప్పు పంపిణీ చేశారు. సాయంత్రం క్షీర ఉట్లు, కాయ ఉట్లు మహోత్సవం జరిగింది. ఆలయ అభివృద్ధి సమితి సభ్యులు, వివిధ గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ఆలయంలో విశేష పూజలు

పట్టణంలోని వాసవి రోడ్డులో కొలువైన కల్యాణ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శని, ఆదివారాలలో విశేషపూజలు నిర్వహించారు. ఆలయ శుద్ధి, సుప్రభాత సేవ అనంతరం మహా అభిషేకం, కల్యాణోత్సవం కార్యక్రమాలు సాగాయి. పుష్పాలంకరణ, తులసి అలంకరణ, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తాలూకాలో ఇటీవల జాతరల సందడి నెలకొంది.

ఘనంగా మహావీర్ జయంతి

బెంగళూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహావీర్ జయంతిని గాంధీ నగర్‌లో ఆదివారం ఘనంగా ఆచరించారు. స్థానిక జైన్ సంఘం ఆధ్వర్యంలో మహావీర్ జైన్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. స్థానిక గాంధీ నగర్ ప్రాంతాలలో మహావీర్ ప్రత్యేక ర్యాలీ సాగింది. జైన్ సామాజిక వర్గీ యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి దినేశ్ గుండూ రావు పాల్గొనగా స్థానిక సంఘం నాయకులు ప్రత్యేకంగా సత్కరించారు. అహింసా ధర్మాన్ని ఆచరించి పాటించి చూపిన మహావీర్ ఆదర్శాలు నేటికీ అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. జైనులు పెద్దసంఖ్యలో ఉండే ప్రాంతాల్లో విశేష కార్యక్రమాలు కొనసాగాయి.



మహావీర్ జైన్‌కు ప్రత్యేక అభిషేకం



పురవీధుల్లో జైన్ చిత్రపటం ఊరేగింపు

ప్రమాదకరంగా గ్రిల్



దెబ్బతిన్న గ్రిల్ ఇదే...

చింతామణి, ఏప్రిల్ 21: పట్టణంలోని ఏపీఎంసీ టమోటా మార్కెట్‌లో డ్రైనేజ్ కోసం అమర్చిన ఇనుప గ్రిల్ దెబ్బతింది. సిమెంట్ పెచ్చులూడగా గ్రిల్ లోని కొన్ని కమ్మీలు బయటకు వచ్చాయి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం గ్యారెంటీ. దెబ్బతిన్న కమ్మీల వద్ద రెండు సిమెంటు దిమ్మెలు మాత్రం ఉంచారు. వాహనాలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నటికీ వీటిని బాగు చేయడంలో తగిన చొరవ చూపలేదనే విమర్శలు ఉన్నాయి. మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉందని పెను ప్రమాదాలు చోటు చేసుకోక ముందే తగిన చర్యలు చేపట్టాలని కేఆర్ఎస్ పార్టీ తాలూకా అధ్యక్షుడు, ఆటో డ్రైవర్ అబ్దుల్ ఖయ్యూం అభి ప్రాయపడ్డారు. నిత్యం రద్దీగా ఉండే మార్కెట్‌లో ఇలాంటి నిర్లక్ష్యం సరికాదన్నారు.

టిప్పర్ ఢీ కొని చిన్నారి మృతి

బెంగళూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ లారీ ఢీ కొనడంతో నాలుగేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన కెంగేరి పరిధిలోని రామోహళ్ళిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. అమిత్, పూజా దంపతుల కుమా రుడికి చిరుతిండ్లు కొనేందుకు వెళ్లిన సమయంలోనే ప్రమాదం జరిగింది. టిప్పర్ కింద పడ్డంతో తలతో పాటుశరీరం నుజ్జునుజ్జయ్యింది. కుమారుడిని కోల్పోయిన తల్లిదండ్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి. కుంబళగోడు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వైభవంగా సీతారామ కల్యాణం



సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామిలకు అలంకరణ

బెంగళూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బనశంకరి పరిధిలోని కత్రిగుప్పె కల్యాణ రామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమి, 24వ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. బుధవారం వేడుకలు ఆరంభం కాగా ఆదివారం సీతారామ కల్యాణోత్సవం జరిగింది. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, మజ్జిగ, పానకం పంపిణీ చేశారు.

చిత్రకళాపరిషత్‌లో ఇండియన్ హాత్ ఫెస్టివల్



ఉత్పత్తులతో దీక్షాబర్న్‌వాల్


బెంగళూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చిత్రకళా పరిషత్‌లో చేతివృత్తులు, చేతిమగ్గాల ఉత్పత్తుల మేళా ఇండియన్ హాత్ ఫెస్టివల్ లాంఛనంగా ప్రారంభించారు. దీక్షాబర్న్‌వాల్ ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించేందుకు నగర ప్రజలు ఆసక్తి చూపా లన్నారు. శతాబ్దాలకాలంగా కొన్ని వృత్తులపైనే ఆధారపడ్డవారి మనుగడ కొనసాగించేందుకు ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. ఈనెల 29వరకు ప్రదర్శనలు ఉంటాయన్నారు.

ఏఐ ఫీచర్‌లతో శ్యాంసంగ్ టీవీలు

బెంగళూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ కంపెనీ శ్యాంసంగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స (ఏఐ) ఫీచర్‌లతో సరికొత్త టెలివిజన్‌లను లాంఛనంగా విడుదల చేసింది. ఎంజీ రోడ్డులోని శ్యాంసంగ్ ఓపెరా హౌస్‌లో అన్‌బాక్స్ అండ్ డిస్కవర్ కార్యక్రమంలో అల్ట్రా ప్రీమియం నియోక్యూ ఎల్ఈడీ 8కే, 4కే, ఓఎల్ఈడీ టీవీలను కంపెనీ నైరుతి ఏషియా చైర్మన్ జేబీ పార్క్ ఆవిష్కరించారు. ఇండియా విజువల్ డిస్‌ప్లే బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ మోహన్ దీప్‌సింగ్ పాల్గొన్నారు. నెలాఖరునుంచి టీవీలు మార్కెట్‌లో అందుబాటులు ఉంటాయని 8కే మోడల్ రూ.3.19 లక్షలనుంచి ఆరంభం కానుండగా 4కే మోడల్ రూ.1.39 లక్షలనుంచి ప్రారంభం కానుందని, ఓఎల్ఈడీ రూ.1.64 లక్షలనుంచి ఆరంభం కానుందన్నారు. కొనుగోలుదారులకు రూ.30వేలనుంచి 80వేలదాకా విలువైన సౌండ్‌బార్‌లు ఉచితంగా ఇస్తామన్నారు.

జేడీఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరిక

చింతామణి, ఏప్రిల్ 21: ఎన్నికల వేళ నాయకులు పార్టీలు మారుతుండడం పరిపాటిగా మారింది. లోక్‌సభ పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో జేడీఎస్‌కు చెందిన నగరసభ సభ్యుడు సీకే షబ్బీర్, మహిళా సభ్యురాలు అషియానవాజ్ భర్త, జేడీఎస్ యువ నాయకుడు సాదిక్‌లు ఒక్కసారిగా కాంగ్రెస్‌లో చేరారు. శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో మసీదు ముతువల్లి, ముస్లిం ప్రముఖుల సమక్షంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్సీ నసీర్ అహ్మద్, చిక్కబళ్ళాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, బాగేపల్లి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, మాజీ మంత్రి శివశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంత్రి జమీర్ స్వయంగా పార్టీ కండువాతో షబ్బీర్, సాదిక్‌లను ఆహ్వానించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.62	1,576.61
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	155	255
సామర్థ్యం (టీఎంసీలు)	3.84	3.04

ఘనంగా మహావీర జయంతి



మహావీరుడికి నివాళులర్పిస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 21: కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మహావీర జయంతిని సాంస్కృతిక మందిరంలో ఆదివారం నిరాడంబరంగా నిర్వహించారు. నగరంలోని అనంతపురం రోడ్డులో ఉన్న సాంస్కృతిక భవనంలో లోక్ సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున సరళంగా జయంతి కార్యక్రమాన్ని లాంచనంగా నిర్వహించారు. మహావీరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు నాగరాజుతోపాటు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరుగుప్పలో..

సిరుగుప్ప, ఏప్రిల్ 21 : వర్ధమాన్ మహావీరుడు సత్యం, అహింస, శాంతి సందేశాలను చాటిచెప్పిన మహావ్యక్తి అని డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర అభిప్రాయం ఆదివారం సిరుగుప్ప పట్టణంలో మహావీర జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్యం



మారథాన్‌లో పాల్గొన్న అధికారులు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 21: మే 7వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు ఓటు హక్కును వినియోగించుకుని ప్రజా ప్రభుత్వంలో ఉత్తమమైన నాయకుడిని ఎన్నుకొనేందుకు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా విజ్ఞప్తిచేశారు. జిల్లా స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మారథాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించి ఓటరు జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి ఒటరు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుని జిల్లాలో వందశాతం ఓటింగ్ నమోదయ్యేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా స్వీప్ ఐకాన్ నృత్యకళాకారుడు ఎస్.కె.ఆర్ జిలాని భాష మాట్లాడుతూ ప్రతి ఐదేళ్ళకొకమారు వచ్చే ఎన్నికల్లో ప్రతి ఓటరు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ సిఇఓ, జిల్లా స్వీప్ అధ్యక్షులు రాహుల్ శరణప్ప సంకనూరు, జిల్లా సహాయాధికారి మహ్మద్ ఎన్.ఝుబేర్, అసిస్టెంట్ కమీషనర్ హేమంత్, జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లేశ్వరస్వామి పట్టాభిషేకం



కరూరులో వివిధ దేవతామూర్తుల ఊరేగింపు

సిరుగుప్ప, ఏప్రిల్ 21: సిరుగుప్ప తాలుకాలోని కరూరు గ్రామంలో ఘనంగా మల్లేశ్వరస్వామి పట్టాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలో వివిధ దేవతామూర్తుల విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు తిలకించడానికి తాలుకా వ్యాప్తంగా గ్రామ ప్రజలు తరలివచ్చారు. అర్చకులు స్వామి వారికి ధూప దీప నైవేద్యాలతో పూజలు జరిపి మహామంగళహారతి నిర్వహించారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

● 11 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు గుర్తింపు ● నేడు ఉపసంహరణ

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 21: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి శనివారంతో నామినేషన్‌ల పరిశీలన ముగిసిందని, బళ్ళారి లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి 13నామినేషన్‌లు రాగా, 11 మంది అభ్యర్థుల నామినేషన్‌లు సక్రమంగా ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. జాతీయ రాజకీయ పార్టీల అభ్యర్థుల్లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఈ.తుకారాం, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి వాల్మీకి కృష్ణప్ప, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బి.శ్రీరాములుకు చెందిన నామినేషన్‌లు సరిగా ఉన్నాయన్నారు. వీరితోపాటు గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థుల్లో కర్నాటక రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి సి.చెన్నవీర, సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ అభ్యర్థి ఎ.దేవదాస్, జనశక్తి పార్టీ అభ్యర్థి మంజప్ప, నవభారత్ సేన పార్టీ అభ్యర్థి జి.స్వామికి చెందిన నామినేషన్‌లు క్రమబద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇక స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్‌లు వేసిన ఎస్.హిరేహాల్, వై.పంపాపతి, బి.భాగ్యలక్ష్మి, వీరేశ్‌ల నామినేష్‌లు కూడా క్రమబద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏప్రిల్ 22, సోమవారం నామినేషన్‌లు ఉపసంహరణకునేందుకు అవకాశం ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు.



నామినేషన్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్

రక్తదాతలకు ప్రసిద్ధి.. జల్లాపుర గ్రామం

ఒక్కో ఇంటికి కనీసం ఇద్దరు రక్తదాతలు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 21: సాధారణంగా ఓ రాజకీయ వ్యక్తి కారణంగానో... లేక పోతే ఇతరత్రా కారణంగానో కొన్నిగ్రామాలు వెలుగులోకి రావడం పరిపాటి. అయితే ఏకంగా రక్తదానం చేయడం ద్వారా హావేరి జిల్లాలో ఓ గ్రామం వెలుగులోకి వచ్చింది. రక్తదాతల గ్రామంగా వినుతికెక్కింది. హావేరి జిల్లా పరిధిలోని సవణూరు తాలూకా 'జల్లాపుర' అతి ఎక్కువగా రక్తదానం చేసిన గ్రామంగా గుర్తింపు తెచ్చుకుంది. కుగ్రామమైన జల్లాపురలో కేవలం 520ఇళ్ళు ఉన్నాయి. కాని ఒక్కో ఇంటిలో కనీసం ఇద్దరు రక్తదాతలు ఉండడం విశేషం. గ్రామంలో యువకులు జీవదాని బళగ (సంఘం) పేరుతో ఓ సంఘాన్ని ఏర్పాటు చేసుకుని నిరంతరం రక్తదానం చేస్తుంటారు. గతంలో కరోనా సమయంలో గ్రామంలో చాలామంది గర్భవతులు, ఇతరత్రా వ్యాధులతో బాధపడుతున్న వారు సరైన సమయంలో రక్తం అందక మృతి చెందిన సంఘటనలు ఆ గ్రామస్థులను ఆలోచింపజేశాయి. దీంతో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలనే ఉద్దేశ్యంతో గ్రామస్థులు అప్పటి నుంచి రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నారు. గ్రామంలో జీవదానిగల బళగ(సంఘం)గా ఏర్పాటు చేసుకుని ప్రతి ఏటా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ సేకరించిన రక్తాన్ని బ్లడ్ బ్యాంకుకు అందజేస్తుంటారు. గ్రామంలోని ప్రముఖ సర్కిళ్ళలో రక్తదాన మహత్యం తెలిపే బోర్డులు ఏర్పాటు చేయడం ప్రత్యేకత. జల్లాపుర గ్రామ బస్టాండులో రక్తదానం చేయడం ద్వారా కలిగే లాభాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే రీతిలో బోర్డులు ఏర్పాటు చేశారు. ఎలాంటి వారు రక్తదానం చేయవచ్చు, సంవత్సరానికి ఎన్నిసార్లు రక్తదానం చేయవచ్చు, అందువలనఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి తదితర వివరాలు ఆ బోర్డుల్లో కనిపిస్తాయి. ప్రారంభంలో వేళ్ళపై లెక్కపెట్టేలా రక్తదాతలు ముందుకు రాగా... ప్రస్తుతం ఆ సంఖ్య 520 మందికి దాటింది. ఒక్కో యువకుడు 10సార్లు కంటే ఎక్కువగా రక్తదానం చేసిన వారే.

జీవం ఉన్నంతవరకు రక్తదానం... జీవం పోతే నేత్రదానం... అంగదానం అనే సందేశాలు గ్రామ ప్రజల నోట వినిపిస్తాయి. రోడ్డుపై ప్రమాదం జరిగితే... తమకెందుకులే.. అంటూ వెళ్లిపోయే జనం ఉన్న నేటి రోజుల్లో ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడానికి ఏకంగా ఓ గ్రామ ప్రజలంతా ముందుకు రావడం.ఎంతో విశేషం. జల్లాపుర గ్రామప్రజల దానగుణం... అందరికీ స్ఫూర్తిదాయకం కావాలని కోరుకుందాం..!!



రక్తదాతల గ్రామంగా పేర్కొంటూ జల్లాపురలో ఏర్పాటు చేసిన బోర్డు

కార్పొరేషన్‌లో నిలిచిపోయిన పన్ను వసూళ్లు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 21: బళ్లారి మున్సిపల్ కార్పొరే షన్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపునకు సంబంధించి సర్వర్ సమస్య ఏర్పడి సుమారు 18 రోజులుగా బిల్లుల వసూళ్లు నిలిచిపోయాయి. ఏప్రిల్ నెలలో ఆస్తిపన్ను చెల్లించిన వారికి 5శాతం రాయితీ ఇస్తామని బళ్లారి మున్సిపల్ కార్పొరేషన్ గత నెలలో ప్రకటించింది. బ్యానర్లు, బోర్డులు కూడా పెట్టి ప్రచారం చేశారు. ఇందుకు నెల



కార్పొరేషన్ కార్యాలయం (ఫైల్)

సర్వర్ డౌన్ కావడమే కారణమని వెల్లడి

ప్రారంభంలోనే పౌరుల నుంచి మంచి స్పందన కూడా వచ్చింది. అయితే ఆస్తిపన్ను వసూలు సర్వర్ సమస్యతో ఆగిపోయింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పన్ను చెల్లింపు వ్యవస్థలను నిలిపివేశారు. దీనిపై పౌరులు కార్పొరేషన్‌పై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు.

ఏప్రిల్లోగా పన్ను చెల్లిస్తే 5శాతం మినహాయింపు ఇస్తామని కార్పొరేషన్ స్వయంగా చెప్పిందని, పన్ను చెల్లించేందుకు ఈనెలలో మూడుసార్లు కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లినా సర్వర్ డౌన్ అని సమాధానం వస్తోందని వలిభాషా, తిమ్మప్ప తదితర ఇంటియజమానులు నిరసన వ్యక్తంచేశారు. సమస్యపై కార్పోరేషన్ అధికారులు మాట్లాడుతూ, కర్నాటక మున్సిపల్ డేటా సొసైటీ (కేఎండీఏసీ) రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలు ఉపయోగించే సాఫ్ట్ వేర్‌ను నిర్వహిస్తుందని, అందులో సాంకేతిక ఇబ్బంది తలెత్తడంతో సర్వర్ సమస్య తలెత్తిందని కార్పొరేషన్ అధికారి తెలిపారు. రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారవుతుందని తెలిపారు.

-మినహాయింపు పొడిగింపు

కార్పొరేషన్ పన్నులు వసూలు నిలిచిపోయి 18 రోజులు కావస్తోంది. వేసవి, ఎన్నికల నేపథ్యంలో పన్ను రాయితీ వ్యవధిని పొడిగింపుపై నిర్ణయం తీసుకుంటామని కార్పొరేషన్ జోనల్ కమిషనర్ గురురాజ్ సవడి తెలిపారు.

రాజకీయ పార్టీల సహకారంతోనే ప్రశాంతంగా ఎన్నికలు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 21: బళ్లారి లోక్‌సభ నియోజకవర్గంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ చంద్రశేఖర్ శఖమురి విజ్ఞప్తి చేశారు. నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బళ్లారి జిల్లాలో ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, అక్రమాలు జరగకుండా అనేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించిన డబ్బు, వస్తువులు, మద్యం సహా ఏదైనా మెటీరియల్ పంపిణీ చేస్తే తమ దృష్టికి తీసుకురావచ్చునన్నారు. మొత్తం నియోజకవర్గంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ప్రతినిధిగా పని చేసేందుకు ఇక్కడికి వచ్చామని, ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీల సహకారం అవసరమన్నారు. బళ్లారి లోక్‌సభా నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన ప్రతి ప్రక్రియను రాజకీయ పార్టీల దృష్టికి తీసుకెళ్ళి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికలకు సంబంధించి నిర్దిష్టమైన ఫిర్యాదులు ఏమైనా ఉంటే 1950 హెల్ప్‌లైన్‌కు లేదా సీ-విజిల్ యాప్ ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ జుబేరాతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్నచంద్రశేఖర్ శఖమురి

హిరేమఠ్ కేసులో పోలీసులకు కాప్ ఆఫ్ ది మంత్

● హత్య జరిగిన గంటల వ్యవధిలోనే నిందితుడి అరెస్టు



పోలీసులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న కమిషనర్

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 21: రాష్ట్ర వ్యాప్తంగా సంచనలం సృష్టించిన నేహా హిరేమఠ్ హత్యకేసును ఛేదించిన పోలీసుల బృందానికి 'కాప్ ఆఫ్ ది మంత్' అవార్డును హుబ్లి-ధారవాడ నగర పోలీసు కమీషనర్, అందజేశారు. కళాశాల యువతి నేహా హిరేమఠ్ హత్యకు గురైన వెంటనే నిందితుడిని పట్టుకునేందుకు హుబ్లీ ఉత్తర ఉప విభాగం ఏసిపి శివప్రకాష్ నాయక్, విద్యానగర్ పోలీసు స్టేషన్ పోలీసు ఇన్‌స్పెక్టర్ డి.కె.పాటిల్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం నిందితుడు ఫయాజ్‌ను ఘటన జరిగిన కొన్ని గంటల వ్యవధిలో అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచింది. పోలీసుల దక్షతను ప్రశంసిస్తూ పోలీసు కమీషనర్, ఏసిపిలు విద్యానగర్ పోలీసు స్టేషన్ సీఐ నేతృత్వంలోని బృందానికి కాప్ ఆఫ్ ది మంత్ ప్రకటించడంతో పాటు రూ.25వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు.

నిందితుడిని ఉరితీయాలి

గంగావతి రూరల్, ఏప్రిల్ 21: కొప్పళలో అశోక్ సర్కిల్ వద్ద ఆదివారం నేహా హిరేమఠ్ హత్యను వ్యతిరేకిస్తూ వీర మహేశ్వరీ క్షేమాభివృద్ధి సంఘం నిరసన తెలిపింది. అధ్యక్షుడు శరణయ్య మాట్లాడుతూ చాకుతో పొడిచి ఆమెను హత్య చేసిన నిందితుడిని ఉరితీయాలన్నారు. ఈ సంఘటనతో కాలేజీకి వెళ్లే విద్యార్థులు భయాందోళనలో ఉన్నారని, ఇలాంటి వారికి శిక్ష పడితే మిగతా వారు కూడా భయపడతారన్నారు. ఈసందర్భంగా చంద్ర, వీరభద్ర, గురుభసప్ప, శంకర్, మంజునాథ్‌స్వామి, దొడ్డబసయ్యస్వామి, బసవయ్య, గురుస్వామి, జంగమ సమాజం వారు పాల్గొన్నారు.

గంగావతిలో జోరందుకున్న కాంగ్రెస్ ప్రచారం



చర్చిఫాదర్ ఆశీస్సులు తీసుకుంటున్న కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ హిట్నాల్

గంగాతి రూరల్,ఏప్రిల్ 21: గంగావతితో కాంగ్రెస్ ప్రచారం జోరందుకుంది. గంగావతిలో ఆదివారం ఈసీఐ చర్చికి లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ హిట్నాల్, మాజీ ఎమ్మెల్సీ హెచ్.ఆర్. శ్రీనాథ్ వెళ్లి అక్కడ చర్చి ఫాదర్ ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వెనకబడిన వర్గాలకు, క్రైస్తవులకు సాయం అందించే విషయంలో కాంగ్రెస్ ముందుంటుందన్నారు. ఈసారి కొప్పళ నియోజకవర్గ లోక్‌సభ ఎన్నికలలో తనకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈప్రచార కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరాములు విస్తృత ప్రచారం



తోరణగల్లు స్టేషన్‌లో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీరాములు

తోరణగల్లు, ఏప్రిల్ 21 : బీజేపీ దేశానికి ఎన్నో సేవలు అందించిందని బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీరాములు అన్నారు. ఆయన ఆదివారం సండూరు తాలుకా భుజంగనగర్ రోడ్డు, బసాపురం, కురేకుప్ప, తోరణగల్లు స్టేషన్ మొదలగు ప్రాంతాల్లో జరిగిన సమావేశాలలో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థులకు రక్షణ లేకుండా వుందని అన్నారు. అలాగే స్థానికంగా ఉన్న ఇళ్లస్థలాల సమస్యపై కూడా న్యాయం చేస్తానని చెప్పారు. ఎల్లప్పుడూ తాను వారి సేవలో వుంటానని చెప్పారు. ఈ సందర్భంగా బీజేపీ బీజేపీ ప్రముఖులు రామకృష్ణ, పులికొండ రవికుమార్, దివాకర్, జీటీ పంపాపతి, సోమప్ప మొదలగు ప్రముఖులు పాల్గొన్నారు.

పురాతన మానవుని అవయవాల ప్రదర్శన



పురాతన కాలంనాటి మానవుని పుర్రెను చూపుతున్న శాస్త్రవేత్తలు

బళ్లారి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బళ్లారి సమీపంలో సంగనకల్లు వద్ద ఉండే రాబర్ట్ బ్రూస్ ఫుట్ మ్యూజియంలో సుమారు 4 లక్షల సంవత్సరాల నాటి మానవుడి అవశేషాలను ఆదివారం ప్రదర్శనకు ఉంచారు. ఈ శిలాజాన్ని మొత్తం 15పుర్రెలు (ప్రపంచంలో వివిధ కాలాల నుండి) ఉన్న మ్యూజియంలో ఉంచారు. బళ్లారి నగరానికి చెందిన ప్రముఖ దంతవైద్యుడు, అలాగే ప్రముఖ పురావస్తు శాస్త్రవేత ప్రొఫెసర్ రవి కోరిశెట్టర్ నుంచి దివాకర్ హోమో సర్పడెన్సిస్ శిలాజాన్ని స్వీకరించి ప్రదర్శనకు ఉంచారు.

హోసూరు జోన్

ఈవీఎంల భద్రతపై పరిశీలన



సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి), ఏప్రిల్ 21: కృష్ణగిరి లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్ ప్రక్రియ ముగిశాక ఈవీఎంలను భద్ర పరిచిన స్ట్రాంగ్ రూంను కలెక్టర్ సరయు పరిశీలించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలు భద్ర పరిచిన విషయం విదితమే. ఆదివారం ఇక్కడి సీసీటీవీ ఫుటేజీలు, భద్రతా వ్యవస్థను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

వైభవంగా మారియమ్మ దేవాలయ కుంభాభిషేకం

హోసూరు(సిఫ్‌కాట్), ఏప్రిల్ 21 హోసూరు సమీపంలోని మల్లసంద్రం గ్రామంలో కొలువైన, పురాతనమైన గ్రామ దేవత మారియమ్మ దేవి ఆలయ కుంభాభిషేకం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో తొలిరోజు గంగాపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచన, దేవనంది యాగశాల ప్రవేశం, వాస్తు హోమం, పంచగవ్య కళశ స్థాపన, విమానగోపుర స్థాపన తదితర ధార్మిక కార్యక్రమాలు సాగాయి. కుంభాభిషేకంలో భాగంగా మహిళలు పెద్దసంఖ్యలో కళశాలతో ఊరేగారు. హోమాలు, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా సీతారామ కల్యాణోత్సవం

హోసూరు, ఏప్రిల్ 21: హోసూరు శ్రీ రామాంజనేయ భక్తమండలి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని బస్తీ రోడ్డులోని ప్రైవేట్ కల్యాణమండపంలో నిర్వహించారు. కార్యక్రమంలో మొదటి రోజు విఘ్నేశ్వర పూజ, హనుమాన్ పూజ, గురు సంకీర్తనలు జరిగాయి. రెండోరోజు వేదపఠనం, సీతారామ కళ్యాణం, ఉత్సవం ఆంజనేయ ఉత్సవం, మంగళారతి కార్యక్రమాలు జరిగాయి. అర్చకుల బృందం ధార్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించింది. కార్యక్రమాల్లో హోసూరు నగర, పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

వ్యర్థాలకు నిప్పు - ప్రజలకు ఇబ్బంది

హోసూరు, ఏప్రిల్ 21: హోసూరు సమీపంలోని శాంతపురం సరస్సు ప్రాంతంలోని కొన్న ప్రైవేట్ ఫ్యాక్టరీల నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలను సరస్సులో వదిలేస్తున్నారు. ఇలాంటి వ్యర్థాలకు రాత్రివేళల్లో నిప్పు పెడుతున్నారు. ఫ్యాక్టరీ వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో వెలువడే పొగ రసాయనాలతో కూడి ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హోసూరు బేడరపల్లి కామరాజ్ నగర్, శాంతపురం, చిన్న యళసగిరి నుంచి కృష్ణగిరి జిల్లాలోని సిప్‌కాట్ ప్రాంతంలో పదివేలకుపైగా కుటుంబాలు ఉన్నాయి. ఎక్కువ మంది కార్మికులు ఇక్కడ ఉంటున్నారు. వ్యర్థాలను కార్మికులు సరస్సులో పడేసి నిప్పంటిస్తున్నారు. ఆ పొగతో ఊపిరాడక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వ్యర్థాలనుంచి వెలువడుతున్న పొగ

మహిళా సాధికారితకు మరిన్ని ప్రణాళికలు



యరమరస్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కుమార్ నాయక్, రవిభోసరాజ్

రాయచూరు, ఏప్రిల్ 21 : రాష్ట్రంలో మహిళలను మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సరికొత్త ప్రణాళికలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రాయచూరు లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి జీ కుమార్‌నాయక్ అన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రవి భోసరాజుతో కలిసి ఆదివారం రాయచూరు సిటీ అసెంబ్లీ పరిధిలోని యరమరస్ తదితర గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కుమార్ నాయక్, ఈ ప్రాంతం అభివృద్ధి కోసం అన్ని రకాల కార్యక్రమాలను చేపట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తనకు అవకావం కల్పించి ఎన్నికల్లో ఆశీర్వదించాలని ప్రజలను అభ్యర్థించారు. యూత్ కాంగ్రెస్ రవిభోసరాజు మాట్లాడుతు సమైక్యత, సమగ్రతలకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్ని వర్గాల ప్రజలు సర్వతోముఖాభివృద్ధి సాధించేలా కృషి చేయడమే కాంగ్రెస్ పార్టీ సిద్ధంతామన్నారు.

హైస్కూల్ టీచర్‌పై సస్పెన్షన్ వేటు..!

రాయచూరు, ఏప్రిల్ 21 : నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించాడన్న కారణంగా రాయచూరు తాలూకా ఉడమగల్ ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కే రామును జిల్లా అధికారి, జిల్లా ఎన్నికల అధికారి చంద్రశేఖర్ నాయక్ ఆదివారం సస్పెండ్ చేశారు. రెండు రోజుల క్రితం బెంగళూరుకు కేపీ నంజుండి గృహానికి వెళ్లిన ఉపాధ్యాయుడు రాము, నంజుండి ఇంటికి వచ్చిన అతిథులకు ఉపహారాన్ని వడ్డించారు. వచ్చిన అతిథుల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఉండడమే కాకుండా ఆయనతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వారందరికి ఉపహారం వడ్డించారన్న కారణంగా రాముని అధికారులు సస్పెండ్ చేశారు. ఆయన ఉపహారాన్ని వడ్డిస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో దీనిపై స్పందించిన జిల్లా అధికారి ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.